
ప్రజాశక్తి
శనివారం 14 అక్టోబర్ 2023



జాతీయ ఖోఖో పోటీలకు ముగ్గురు పిఇటిలు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అక్టోబర్ 16వ తేదీ నుండి 19వరకు న్యూఢిల్లీ లో జరిగే జాతీయ స్థాయి ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఖోఖో పోటీలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టులో జిల్లాకు చెందిన ముగ్గురు వ్యాయామ ఉపాధ్యాయినులకు అవకాశం లభించింది. ఆలిండియా సివిల్ సర్వీసెస్ పోటీలో మొదటి సరిగా ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నారు. వ్యాయమ ఉపద్యారాలుగా పనిచేస్తూ క్రీడాకారులను తయారుచేస్తున్న కోనూరు హైస్కూలు పిఇటి ఎస్.విజయలక్ష్మి, పెద్దతాడివాడ హైస్కూలు వ్యాయమ ఉపాధ్యాయురాలు సిహెచ్. ఆదిలక్ష్మి, మెట్టపల్లి హైస్కూలు పిఇటి ఎస్.కనక మహాలక్ష్మి రాష్ట్రజట్టుకు ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల జిల్లా కబడ్డీ, ఖోఖో అసోసియేషన్ నాయకులు, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఎండుతున్న వరి

రెండు జిల్లాల్లోనూ వర్షపులోటు ● ఆందోళనలో అన్నదాత

ఇటు విజయనగరం, అటు పార్వతీపురం మన్యం జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. దీంతో, ఇరు జిల్లాల్లోనూ అత్యంత ప్రధానమైన వరి పంట ఎండిపోతోంది. నీరు లేక పలు గ్రామాల్లో దుర్భిక్ష పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళనకు గురౌతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వరిపై ఆశలు వదులుకోవాల్సిందేనంటూ ఆవేదన చెందుతున్నారు.



తెర్లాంలో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న రైతులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లాలో ఈ ఖరీఫ్‌లో వరి 2,25,637 ఎకరాల్లో సాగుకావాల్సి వుండగా 2,24,632 ఎకరాల వరకు సాగైంది. మిగిలిన విస్తీర్ణంలో ఇతర పంటలన్నీ ఉన్నాయి. జిల్లాలో పెద్దగా సాగునీటి ప్రాజెక్టులు లేవు. తోటపల్లి కాలువలు ఉన్నప్పటికీ నిర్వహణ సరిగా లేకపోవడం, పిల్లకాలువల పనులు పూర్తిచేయక పోవడం వంటి కారణాల వల్ల అరకొర గానీ నీరు అందుతోంది. ఆంధ్ర, తాటిపూడి వంటి జలాశయాల పరిధిలోనూ ఇటువంటి ఆటంకాలే ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో వరుణుడు కూడా ముఖం చాటేయడంతో పంట పొలాలు ఎండిపోతున్నాయి. జూన్‌లో 51.9 మిల్లీమీటర్ల వర్షపాతం లోటు ఉండడంతో నారు వేయడం ఆలస్యమైంది. జులైలో వర్షాలు సహకరించడంతో నారుపోతలు పూర్తయినప్పటికీ ఆగస్టులో తిరిగి లోటు వర్షపాతం నమోదు కావడంతో సెప్టెంబర్ నెలాఖరు వరకూ పడిన వర్షపునీటితోనే రైతులు ఉబాలు పట్టారు. ఉబాలు అయ్యాయంటూ ఊపిరి పీల్చుకునే లోపు తిరిగి అక్టోబర్ 1వ తేదీ నుంచి పూర్తిగా వర్షాలు కురవలేదు. గడిచిన 13రోజుల వ్యవధిలో 83.5 మి.మీ లోటు వర్షపాతం నమోదైంది. మొత్తం 27 మండలాలకు గాను 24మండలాల్లో ఒక్క చినుకు కూడా రాలలేదు. మిగిలిన ఎస్.కోట మండలంలో 0.1 మి.మీ, కొత్తవలసలో 0.4మి.మీ, సంతకవిటిలో 72.మి.మీ చొప్పున మాత్రమే వర్షం కురిసింది. సీజన్ మొత్తంగా (జూన్ 1 నుంచి ఇప్పటి వరకు) సంతకవిటి, మెరకముడిదాం, మెంటాడ, డెంకాడ మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. బాడంగిలో కేవలం 22 మి.మీ. అధికంగా వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైనప్పటికి మొత్తం 130రోజులకు గాను కేవలం 61రోజులు మాత్రమే వర్షం కురవడంతో చెరువులు పెద్దగా నిండలేదు. మిగిలిన రోజుల్లో తీవ్రమైన ఎండలు కాయడంతో చెరువుల్లో నీరు కూడా పూర్తిస్థాయిలో లేని పరిస్థితి దాపురించింది. ఈనేపథ్యంలో అత్యంత కీలకమైన పొట్టదశలోను, గింజకట్టే దశలోనూ ఉన్న వరి ఎండిపోతోంది.

తెర్లాం మండలం టెక్కలివలస, పెరుమాలి, చిన్నపాలవలస గ్రామాల పరిధిలోనూ నీరులేక దుర్భిక్ష పరిస్థితులు కనిపిస్తున్నాయి. వరి ఎండకు మలమలా మాడిపోతోంది. కొన్ని చోట్ల సాగు భూమి బీటలువారుతోంది.

డెంకాడ మండలంలోని డెంకాడ, గుణుపూర్‌పేట, తాళ్లవలస, మోపాడ, జొన్నాడు, అక్కవరం, రఘుమండ తదితర గ్రామాల్లో వరి పూర్తిగా ఎండిపోయింది. ఎండిన వరిని బతికించుకునేందుకు అవకాశం ఉన్న చోట్ల బావులు, చెరువుల వద్ద కిరోసిన్ మోటార్లు ద్వారా నీరు పెడుతున్నారు. ఇంజన్ల ద్వారా నీరు సరఫరా చేయడం వల్ల అదనంగా వేలాది రూపాయలు పెట్టుబడి పెరుగుతోందని గుణుపూరుపేటకు చెందిన వరి రైతు పైల దుర్గారావు ప్రజాశక్తి ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు.

పార్వతీపురం మన్యం జిల్లాలో.. అన్ని పంటలూ కలిపి సుమారు 2.20లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయి. ఇందులో అత్యధికంగా వరి 1.15లక్షల ఎకరాల్లో ఎకరాల్లో సాగవుతోంది. గత 13రోజుల్లో 63.2 మి.మీ లోటు వర్షపాతంలో నమోదైంది. వీరఘట్టం, జిఎల్‌పురం, కురుపాం, కొమరాడ మండల్లాల్లో వర్షపులోటు ఉంది. సీజన్ మొత్తంగా పరిశీలిస్తే ఈ జిల్లాలోనూ జూన్, ఆగస్టులో వర్షం తక్కువగానే పడింది. ప్రస్తుతం కొమరాడ, పార్వతీపురం, మక్కువ తదితర మండలాల్లో పంట పొలాలు బీటలు వారుతున్నాయి. మరోవైపు ఇటీవల ఎండ తీవ్రత కూడా ఎక్కువగా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరా వరికి రూ.30వేల నుంచి రూ.40వేల వరకు పెట్టుబడులు పెట్టేశామని, ప్రస్తుతం వర్షాలు పడకపోతే మన్నైపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుర్ల మండలంలో సుమారు 9920 ఎకరాల్లో వరి సాగైంది. ఇంతకు మునుపులా గడిగెడ్డ ద్వారా తోటపల్లి నీరు అందడం లేదు. దీనికితోడు చెరువుల్లోనూ పెద్దగా నీరు లేకపోవడంతో పోలాయ వలస, గుర్ల, కొండగంద్రేడు, ఎస్ఎస్ ఆర్‌పేట, గుర్ల తదితర గ్రామాల్లో పంటలు ఎండి పోతున్నాయి. ఈ మండలంలో ఇప్పటికే సగానికి సగం వరి పంట ఎండిపోయినట్టుగా రైతులు చెబుతున్నారు.



గుర్లలో ఇంజిన్‌తో నీరు పెడుతున్న రైతు

వర్షం కురవకపోతే అప్పులపాలే



చేను సరిగ్గా పొట్టదశలో ఉంది. ఈ సమయంలోనే తగినంత నీరుతోపాటు చల్లటివాతావరణం అవసరం. ప్రస్తుతం నీరు లేదు సరికదా తీవ్రమైన ఎండ, వడగాల్పులు ఉన్నాయి. ఈనేపథ్యంలో సాగుచేస్తున్న రెండెకరాల పొలం పూర్తిగా ఎండిపోయింది. అవకాశ ఉన్నచోట ఇంజిన్లతో నీరుపెడుతున్నాం. నీరు లేనిచోట అంతే సంగతులు. ఇదే పరిస్థితి మరికొద్ది రోజులు ఉంటే పంట నాశనమైనట్టే. అప్పుల ఊబిలో కూరుకుపోతామని భయం వెంటాడుతోంది.

- జమ్ము రామకృష్ణ, వరి రైతు
తెట్టంగి గ్రామం, గుర్ల మండలం



కేంద్ర బృందంతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

బొబ్బిలివీణకు అంతర్జాతీయ ఖ్యాతి తీసుకొస్తాం

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

బొబ్బిలి వీణ స్థానిక సంప్రదాయ కళగా మిగిలిపోకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ జరిగేలా చూస్తామని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. అందుకోసం హస్త కళాకారులకు అవసరమగు సాంకేతిక నైపుణ్య శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. బొబ్బిలి వీణ వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ క్రింద అవార్డుకు నామినేట్ అయిన సందర్భంగా కళాకారులను కలిసిన అనంతరం శుక్రవారం కేంద్ర బృందం జిల్లా కలెక్టర్ ను తన ఛాంబర్‌లో కలిసింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీణలు తయారు చేసే కళాకారులకు కావలసిన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటా మన్నారు. జాతీయ స్థాయిలో జియోగ్రాఫికల్ ఇండెక్స్ తో అనుసంధానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు రాబిన్ చరియన్, నమీరా, జిల్లా చేనేత అధికారి మురళి కృష్ణ, అభివృద్ధి అధికారి వసంత, జిల్లా పర్యాటక అధికారి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు వికలాంగులకు ఉపకరణాలు పంపిణీ

కేంద్రమంత్రి నారాయణస్వామి రాక

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని విభిన్నప్రతిభావంతులకు అవసరమైన ఉపకరణాలను కేంద్ర ప్రభుత్వ సంస్థ అలిమ్ కో సహాయంతో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నగరంలోని రాజీవ్ స్టేడియంలో శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో జిల్లాలోని 434 మంది విభిన్నప్రతిభా వంతులకు ఒక్కొక్కరికి రూ.42 వేలు విలువైన బ్యాటరీతో నడిచే మోటరైజ్డ్ మూడు చక్రాల సైకిళ్లను కేంద్ర సామాజిక సాధికారిత సహాయ మంత్రి ఎ.నారాయణ స్వామి అందజేయనున్నారు. దీంతోపాటు విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో గుర్తించిన 310 మందికి ఉపకరణాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నెలలో నియోజకవర్గాల వారీగా నిర్వహించిగ గుర్తింపు శిబిరాల ద్వారా 2337 మందికి ఉపకరణాలు అందజేసేందుకు గుర్తించగా వారందరికీ ఆయా నియోజకవర్గాల్లో పంపిణీకి కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో రాజీవ్ స్టేడియంలో ఉపకరణాల పంపిణీ ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ శుక్రవారం స్టేడియంను సందర్శించారు. వికలాంగులు కూర్చొనేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, వచ్చిన లబ్దిదారులు, వారి సహాయకులకు భోజన వసతి సమకూర్చాలని ఆదేశించారు. వీటిని ఆయా మండలాలకు పంపించేందుకు రవాణా ఏర్పాట్లు చేయాలని రవాణాశాఖ అధికారులను జె.సి. ఆదేశించారు. పంపిణీ కోసం అవసరమైన సహాయ సిబ్బందిని, సహకారాలను మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా అందించాలని మునిసిపల్ కమిషనర్ శ్రీరాములు నాయుడుకు సూచించారు. ఆయన వెంట మెప్మా పీడీ సుధాకర్, విభిన్నప్రతిభావంతుల శాఖ ఎడి జగదీష్, డిసిహెచ్ఎస్ గౌరీశంకర్, డిఎస్ఒ మధుసూధన్, సెట్విజ్ సిఇఒ రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం భూముల రైతులకు

సాగు హక్కు కల్పించాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

దేవస్థానం భూముల రైతులకు సాగు హక్కు కల్పించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగుంట హరి బాబు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్య నారాయణ డిమాండ్ చేశారు. గురువారం రాత్రి తంగుడిబిల్లి గ్రామంలో దేవాదాయ భూముల హక్కు దారుల సంఘం ఆధ్వర్యంలో రైతులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రామతీర్థం రామస్వామిదేవస్థానం పరిధిలో వివిధ గ్రామాలకు చెందిన రైతుల ఆధీనంలో గల భూములకు పూర్తి సాగు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఈ క్రాప్ , రుణాలు, రైతుభరోసా, తదితర పథకాలు వర్తింపు చేయాలని, సమగ్ర భూ సర్వేలో భూ హక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా రైతులు భూమి శిస్తు లు మాత్రమ దేవస్థానానికి చెల్లిస్తారని చెప్పారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి రాంబాబు, దేవాదాయ శాఖ భూముల జిల్లా కమిటీ అధ్యక్షులు కురిమినేని వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌ఒపై కులదూషణ

బొబ్బిలి : మండలంలోని శివడవలస సచివాలయంలో విఆర్ఒగా పని చేస్తున్న అలజంగి అప్పారావును అదే గ్రామానికి చెందిన పెద్దింటి శంకరరావు కులం పేరుతో దూషించినట్లు విఆర్ఒ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫ్యామిలీ సర్టిఫికేట్ కోసం శంకరరావు ఫోన్ చేసి అడగ్గా ఆన్లైన్ చేసి ఆధారాలు ఇవ్వాలని చెప్పినప్పటికీ ఆన్లైన్ చేయకుండా ఫ్యామిలీ సర్టిఫికేట్ ఎందుకు ఇవ్వడం లేదని శుక్రవారం సచివాలయానికి వచ్చి కులం పేరుతో దూషించినట్లు చెప్పారు. కుల దూషణ చేసిన పెద్దింటి శంకరరావుపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు పిర్యాదు చేసినట్లు చెప్పారు. గతంలో రెండు సార్లు దూషించారని తెలిపారు.

పథకాల అమలుకు సహకరించాలి

ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ ● ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా మార్చాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

ప్రజాశక్తి-విజయనగరం

జాతీయ స్థాయిలో అమలవుతున్న పథకాలను సక్రమంగా ప్రజలకు చేరువయ్యేలా అధికారులు సహకరించాలని పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్ర శేఖర్ పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎమ్‌పి అధ్యక్షతన నిర్వహించారు. సంసద్ ఆదర్శ గ్రామ యోజన పథకం కింద అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలపై జిల్లా కలెక్టర్ నాగలక్ష్మితో కలసి సమీక్షించారు. గడప గడప కు మన ప్రభుత్వం బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలని, పనులు వేగంగా జరిగేల చూడాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. జల జీవన్ మిషన్ కింద ఇంటింటికి కుళాయి కార్యక్రమం శత శాతం పూర్తి చేయాలన్నారు. అర్హత ఉండి పింఛన్ అందని వారికి వెంటనే అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారుల అభివద్ధి లో భాగంగా వేస్తున్న రోడ్లకు సంబంధించి లారీ లు గ్రామాల్లో ఎక్కువగా తిరగడం వలన గ్రామ రహదారులు పాడైపోతున్నాయని, ముఖ్యంగా పూసపాటి రేగ వద్ద, గజపతి నగరం వద్ద ఇలాంటి పరిస్థితి ఉందని, అందుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజా ప్రతినిధులు కోరారు. కలెక్టర్ స్పందిస్తూ నేషనల్ హై వే అథారిటీ వారికి ఆదేశాలు జరీ చేస్తామని తెలిపారు.

సంసద్ ఆదర్శ గ్రామ యోజన (సాగి) పథకం కింద జిల్లాలో ఎంపిక చేసిన 5 గ్రామాల్లో చేపడుతున్న కార్యక్రమాలపై అధికారులను ఎంపి ప్రశ్నించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఆయా మండలాల్లో మండల ప్రత్యేకాధికారులు వారానికి ఒకసారి ఆ గ్రామాలను సందర్శించి సర్పంచ్ లు, ఇతర ప్రజా ప్రతినిధులతో కలసి చర్చించాలని సూచించారు. ఆదర్శ గ్రామంగా మారడానికి కావలసిన అన్ని రకాల వసతులను, అవసరాలను గుర్తించాలని సూచించారు. సమావేశంలో ఎంఎల్‌సి ఇందుకూరు రఘురాజు, సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, జెడ్‌పి సిఇఒ రాజ్ కుమార్, జిల్లా అధికారులు, సర్పంచ్ లు, ఎంపిపిలు పాల్గొన్నారు.

ఫేస్ యాప్‌ను రద్దు చేయాలి

- **వర్కర్లపై ఒత్తిడి ఆపాలి**
- **అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్**

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఫేస్ యాప్ ను రద్దు చేయాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు అంగన్వాడీ కార్యకర్తలపై ఒత్తిడి తగ్గించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు వి.లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనసూయ, జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లు సరిగ్గా పనిచేయక పోవడంత ఎఫ్ఆర్ఎస్ యాప్ అంగన్వాడీలకు చాలా ఇబ్బందిగా ఉందని తెలిపారు. ప్రభుత్వానికి అనేక సార్లు విన్నవించినా సమస్య పరిష్కరించడం లేదన్నారు.కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని, కనీసం తెలంగాణ కన్నా వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తామన్న ముఖ్యమంత్రి హామీ అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, పెన్షన్ ఇవ్వాలని, హెల్పర్ల ప్రమోషన్ విషయంలో రాజకీయ జోక్యం లేకుండా ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని, అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యమైన ఫీడింగ్ ఇవ్వాలని, డ్యూటీలో ఉండి చనిపోయిన వారికి పది లక్షలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్‌లో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14, 17 బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలు శుక్రవారం మండలంలోని వెంకటరమణ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 200 మంది బాలురు, బాలికలు హాజరయ్యారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు మన జిల్లా తరపున హాజరుకానున్నారు. కార్యక్రమంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వి రమణ, హెచ్‌ఎం కె.లక్ష్మి, రాపర్తి సాధు, మంచన శివ కోటి, రాపర్తి రామచంద్రరావు, కనిశెట్టి ఈశ్వరరావు, ఎండపల్లి సత్యనారాయణ, పడాల అర్జున్ , ఆవాల కృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు పొట్నూరు శ్రీరాములు పాల్గొన్నారు.

కరాటే పోటీలకు..

విజయనగరం టౌన్ : అండర్ 19 రాష్ట్రస్థాయి పోటీలకు కరాటే బాల, బాలికల జట్లు ఎంపిక శుక్రవారం రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జరిగింది. ఈ పోటీలను సెట్విజ్ సిఇఒ బి.రాంగోపాల్ ప్రారంభించారు. ఏడుగురు బాలికలు, ఏడుగురు బాలురతో ఎంపికైన జిల్లా జట్లు పార్వతీపురం మన్యం జిల్లాలో నవంబర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి పివిఎల్ ఎన్ కృష్ణ తెలిపారు.

15న రామభద్రపురంలో జూడో జట్లు ఎంపిక

అండర్ 19 జూడో జిల్లా జట్లు ఎంపిక రామభద్ర పురం జెడ్‌పి హైస్కూల్ మైదానంలో జరుగుతుందని స్కూల్ గేమ్స్ కార్యదర్శి పివి ఎల్ ఎన్ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్ పట్టుకొని హాజరు కావాలని తెలిపారు.

'దౌర్భాగ్య పాలనలో ఉన్నాం'

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో ప్రజల మధ్యకు రాలేని దౌర్భాగ్య ముఖ్యమంత్రి పాలనలో మనమంతా వున్నామని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక, దుర్మార్గపు పాలన సాగుతోందని విమర్శించారు. అభద్రతా భావంతో సిఎం జగన్ , మంత్రులు నోటికి వచ్చినట్లు మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక స్థాయి దిగజార్చుకొని వ్యక్తిగత విమర్శలకు పాల్పడడం సిగ్గుచేటు అన్నారు. పవన్ కళ్యాణ్ పై జగన్ వ్యాఖ్యలు ఆయన అసహనానికి నిదర్శనమన్నారు. జగన్ గురించి, ఆయన కుటుంబం గురించి వ్యక్తిగత విమర్శలు చేస్తే తట్టుకోగలరా? అని ప్రశ్నించారు.

చంద్రబాబుకు మెరుగైన వైద్యమందించాలి



విజయనగరంకోట.. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ, మెరుగైన వైద్యసేవలందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నగరంలోని అంబేద్కర్ సెంటర్‌లో టిడిపి నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. చంద్రబాబుకు ఏమైనా జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ జైలులో అపరిశుభ్ర వాతావరణం వల్ల చంద్రబాబు అనారోగ్యానికి గురయ్యారని, ఆయన భద్రత పట్ల రాష్ట్రహోంశాఖ మంత్రి స్పందించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై స్పందించకపోవడం అత్యంత దారుణమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు, పట్టణ కార్యాలయ కార్యదర్శి వర్మ రాజు, శ్రీనివాసరావు భరత్, కనకల మురళీమోహన్, కర్రోతు నర్సింగరావు, కంది మురళీనాయుడు, రొంగలి రామారావు, ఎఎ రాజు తదితరులు పాల్గొన్నారు.

గరివిడి : చంద్రబాబుకు మెరుగైన వైద్య సేవలు అందించాలని శుక్రవారం టిడిపి ఆధ్వర్యాన చీపురుపల్లిలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ నాయకులు పైల బలరాం, దన్నాన రామచంద్రుడు, సారేపాక సురేష్‌బాబు, శనపతి శ్రీనివాసరావు, మహంతి అప్పలనాయుడు, గవిడి నాగరాజు, మీసాల నవీన్ పాల్గొన్నారు.

కొత్తవలస : చంద్రబాబును భేషరతుగా విడిచి పెట్టాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక టిడిపి కార్యాలయ ఆవరణలో శుక్రవారం జరిగిన సమావేశంలో టిడిపి కొత్తవలస, జామి మండలాల అధ్యక్షులు గొరపల్లి రాము, లగుడు రవికుమార్, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి, విశాఖ పార్లమెంట్ గొరపల్లి వేలాంగణి సుజాత మాట్లాడారు. చంద్రబాబు అనారోగ్య పరిస్థితి దృష్టిలో ఉంచుకొని సరైన కార్పొరేట్ హాస్పిటల్‌లో చికిత్స చేయించాలని డిమాండ్ చేశారు.

టిడిపి ఆధ్వర్యాన నిరసనలు

నెల్లిమర్ల : మండలంలోని తంగుడుబిల్లిలో బాబుతో నేను కార్యక్రమాన్ని టిడిపి నాయకులు నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ప్రాణహాని

ఎమ్మెల్సీ చిరంజీవి

విజయనగరం కోట : వైసిపి ప్రభుత్వం చంద్రబాబుకు ప్రాణహాని తలపెఎడుతోందని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, విజయనగరం పార్లమెంటరీ అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. జైలులో ఉన్న చంద్రబాబు ఆరోగ్యం క్షీణించినందున వెంటనే మెరుగైన వైద్యసేవలు అందించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ఆరోగ్యం కోసం తాము మాట్లాడుతుంటే ఆయన బరువు పెరిగిందని సజ్జల రామకృష్ణారెడ్డి అపహాస్యం చేయడం దుర్మార్గమన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు పాల్గొన్నారు.



టిడిపి అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిని మాజీమంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు కలిసి సంఘీభావం తెలిపారు.
– ప్రజాశక్తి, బొబ్బిలి, డెంకాడ

దసరా సెలవులకు ఇంటికి వస్తుండగా..

లారీ ఢీకొని తండ్రి మృతి , కుమార్తెకు గాయాలు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

దసరా సెలవులకు వసతిగృహం నుంచి కుమార్తెను ఇంటికి తీసుకొస్తుండగా లారీ ఢీకొనడంతో తండ్రి మృతిచెందాడు. కుమార్తెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషాద సంఘటన మండలంలోని జమ్మాదేవిపేట జంక్షన్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రంగాపురం శివారులో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల ఆశ్రమ పాఠశాలలో సుధా జ్యోత్స్న ఐదో తరగతి చదువుతోంది. శనివారం నుంచి పాఠశాలలకు దసరా సెలవులు ఇవ్వడంతో కొత్తవలస మండలం చీడివలస ప్రాంతానికి చెందిన ఆమె తండ్రి సుధా రాము (40) శుక్రవారం వసతిగృహానికి వచ్చి, కుమార్తె జ్యోత్స్నను ద్విచక్ర వాహనంపై ఇంటికి తీసుకెళ్తున్నాడు. మార్గం మధ్యలో జమ్మాదేవిపేట జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ వారిని బలంగా ఢీకొంది. తండ్రీకూతురికి తీవ్ర గాయాలవడంతో ప్రథమ చికిత్స నిమిత్తం హుటాహుటిన శృంగవరపుకోట సిహెచ్‌సికి తరలించారు. ఆసుపత్రికి చేరేటప్పటికి రాము మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జ్యోత్స్న కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. రాము భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ గోవిందరావు కేసు నమోదు చేశారు.

లింగ నిర్ధారణ చేస్తే క్రిమినల్ కేసులు

డిఎంహెచ్ఒ భాస్కరరావు

ప్రజాశక్తి-విజయనగరం

గర్భస్థ లింగ నిర్ధారణ చేసినవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరావు హెచ్చరించారు. గర్భధారణ పూర్వ మరియు గర్భస్థ పిండ ప్రక్రియ చట్టం-1994 అమలుపై జిల్లా స్థాయి, ఉప జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశాలు శుక్రవారం డిఎంఅండ్‌హెచ్ఒ కార్యాలయంలో జరిగాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గర్భస్థ పిండ పరిస్థితి, వ్యాధుల గుర్తింపు తదితర పరీక్షలకు ఉపయోగించవలసిన యంత్రాలను, లింగ నిర్ధారణకు ఉపయోగిస్తే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్కానింగ్ సెంటర్లను తరచూ తనిఖీ చేయాలని ప్రోగ్రామ్ అధికారులకు సూచించారు. సమావేశంలో వ్యాధినిరోధక టీకా అధికారి, పిసిపి అండ్ డిటి నోడల్ ఆఫీసర్ డాక్టర్ అచ్యుతకుమారి, డిప్యూటీ డిఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎన్.సూర్యనారాయణ, స్త్రీవ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ అరుణ శుభశ్రీ, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఆర్.సుజాతదేవి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పివిఎస్ జయలక్ష్మి, నేచర్ ఎన్‌జిఒ ప్రతినిధి జికె దుర్గ, ప్రయివేటు స్కానింగ్ సెంటర్ల ప్రతినిధి డాక్టర్ జెసి నాయుడు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు అనూహ్య స్పందన



నియామకపత్రాలు అందిస్తున్న ప్రిన్సిపల్ కేశవరావు

శృంగవరపుకోట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. సుమారు 500 మంది పైగా నిరుద్యోగులు హాజరయ్యారు. అందులో పది కంపెనీలకు 225 మంది ఎంపికయ్యారు. వీరికి ప్రిన్సిపల్ సి.హెచ్.కేశవరావు, వైస్ ప్రిన్సిపల్ వాసుదేవరావు, వి.సుధీర్, జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్ భాస్కరరావు ఆఫర్ లెటర్స్ అందించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.గోవిందరావు, జెకెసి కోఆర్డినేటర్ జి.ఈశ్వర్ పాల్గొన్నారు.

ఐటి రంగంలో ఉపాధి అవకాశాలు

విజయనగరం కోట : ఐటిఐ పూర్తి చేసుకున్న యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. ప్రభుత్వ ఐటిఐలో చదువుకొని ఉత్తీర్ణులైన విద్యార్థులకు శుక్రవారం ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశం నైపుణ్య విద్యలో శిక్షణ పొందుతున్న యువత వైపు మొగ్గు చూపుతోందని అన్నారు. నేటితరం యువతకు ఐటి రంగంలో చాలా ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు ప్రతి విద్యార్థి ఉన్నతమైన స్థానాలను అందుకోవాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ టివి గిరి మాట్లాడుతూ పాసైన విద్యార్థులు ఖాళీగా ఉండకుండా మంచి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి నిరంతరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ అధికారి రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పనిలోకి తీసుకోవాలని గ్రీన్ అంబాసిడర్ల నిరసన

బొబ్బిలిరూరల్ : కృష్ణాపురం గ్రామంలో తొలగించిన గ్రీన్ అంబాసిడర్లను వెంటనే పనిలోకి తీసుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు మాట్లాడుతూ 14 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో కలెక్టరేట్లో జగనన్నకు చెబుదాంలో ముగ్గురు కార్మికులు వినతిపత్రంతో కక్ష గట్టి వారిని తొలగించడం దారుణమన్నారు. జీతాలు చెల్లించకుండా చెల్లించినట్లు, ముగ్గురు కార్మికులు సెలవులో ఉన్నట్లు కార్యదర్శి ఉన్నతాధికారులకు నివేదిక పంపించడం దారుణమన్నారు. వెంటనే 14 నెలల జీతాలు చెల్లించాలని, ముగ్గురు కార్మికులకు పని కల్పించాలని డిమాండ్ చేశారు.

పరిశోధన పత్రాలకు ప్రాధాన్యం

నెల్లిమర్ల : సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో పరిశోధన పత్రాలను రూపొందించడంలో అధ్యాపకులు దృష్టి సారించాలని ఐటి డైరెక్టర్ ప్రశాంత్ కుమార్ మహంతి సూచించారు. శుక్రవారం యూనివర్సిటీలో 'వర్క్‌షాప్ ఆన్ రీసెర్చ్ అండ్ పబ్లికేషన్స్' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ పల్లవి పాల్గొన్నారు.

దసరా సెలవుల్లో ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

శృంగవరపుకోట : ప్రయాణికుల సౌకర్యార్థం దసరా సెలవుల్లో శృంగవరపుకోట డిపో నుంచి రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్ నగరాలకు ప్రత్యేక బస్సులు సాధారణ ఛార్జీలతో నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రాను పోను ఒకేసారి టిక్కెట్ తీసుకుంటే ఛార్జీలో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు.

లక్కింపేటలో సిఐ పర్యటన



రికార్డులు తనిఖీ చేస్తున్న సిఐ శ్రీనివాస్

వంగర : మండలంలోని లక్కింపేటలో రాజాం రూరల్ సిఐ ఎస్.శ్రీనివాస్ శుక్రవారం పర్యటించారు. గ్రామంలో ఉన్న పోలీస్ అవుట్ పోస్ట్‌ను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎన్.జనార్ధనరావుతో మాట్లాడి లక్కింపేటలో ఎంతమంది పోలీసులు బందోబస్తులో ఉన్నారు, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందితో మాట్లాడి, సూచనలు చేశారు. అనంతరం ప్రత్యేక కోర్టు వద్ద బందోబస్తు నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు వల్లాపురం విద్యార్థులు

గుర్ల : మండలంలోని వల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు యోగా, బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ తిరుపతిరావు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గురువారం అండర్-19 బాలబాలికల జిల్లా జట్టుకు ఎంపిక చేసింది. యోగాకు ముగ్గురు, బ్యాడ్మింటన్‌కు నలుగురు విద్యార్థులు వల్లాపురం పాఠశాల నుంచి ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయులు వి.అప్పారావు, యోగా శిక్షకులు హరిబాబు అభినందించారు.

ఓటమి భయంతోనే పవన్‌పై విమర్శలు

గజపతినగరం : జగన్ రెడ్డి ఓటమి భయంతో, అభద్రతాభావంతో జనసేనాని పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగత దూషణ చేస్తున్నారని జనసేన పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ మిడతాన రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుటుంబం అంటే గౌరవం లేని వ్యక్తి సిఎం జగన్ కాదా? అని ప్రశ్నించారు. సొంత తల్లి, చెల్లి మీద చులకన భావం జగన్ రెడ్డిది అని ఆక్షేపించారు. కుటుంబ వ్యవస్థ మీద గౌరవం ఉంటే, దమ్ముంటే సొంత బాబాయి హత్య కేసుపై పోరాడుతున్న చెల్లెలికి ఎందుకు మద్దతు ఇవ్వలేదని నిలదీశారు. రాజకీయ స్వలాభం కోసం తల్లిని, చెల్లిని రోడ్లపైకి తెచ్చి, నేడు తరిమేసింది జగన్ కాదా? అని ప్రశ్నించారు.

వీలుపర్తిలో గడపగడపకు..

వేపాడ : మండలంలోని వీలుపర్తి గ్రామంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యాన శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ఆరాతీశారు. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్‌పర్సన్ ఎం.కన్నారి, ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, సర్పంచ్ నిరంజన్ వెంకటరావు, వైస్ ఎంపిపి ఎ.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

గజపతినగరం : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎంపిపి బెల్లాన జ్ఞానదీపిక, జెడ్‌పిటిసి గార తవుడు అన్నారు. శుక్రవారం గజపతినగరం నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వారు ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, నాయకులు బెల్లాన త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు క్రీడా పరికరాలు

దెంకాడ : మండలంలోని పాఠశాల, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలకు క్రీడలకు సంబంధించిన మెటీరియల్స్ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిందని ఎంఇఒలు కె.వెంకట రమణ, సి.హెచ్.రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం వీటిని ఎంఆర్‌సి సిబ్బంది అన్ని పాఠశాలలకు పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీను, కృష్ణ, మహేష్, భాస్కరరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుడ్డు వినియోగం తప్పనిసరి

రామభద్రపురం : పోషక విలువల కోసం ఆహార వినియోగంలో గుడ్డు తప్పనిసరిగా తీసుకోవాలని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు తెలిపారు. ఇంటర్నేషనల్ ఎగ్ డే సందర్భంగా శుక్రవారం నాయుడువలస స్కూల్లో సమతుల ఆహారం - గుడ్డు వినియోగం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగభూషణం, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కమిటీ సమావేశం

వేపాడ : వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రుల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఎంఇఒ బాలభాస్కరరావు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

బిజెపి జిల్లా కార్యదర్శిగా శ్రీనివాసరావు

విజయనగరం కోట : బిజెపి జిల్లా కార్యదర్శిగా బొబ్బిలి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా అధ్యక్షులు ఎన్.ఈశ్వరరావు నుంచి ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. పార్టీఅప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తానని ఈసందర్భంగా ఆయన అన్నారు.

ప్రజల ముంగిటకే వైద్య సేవలు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల ముంగిటకే వైద్య సేవలు అందుతున్నాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 29వ డివిజన్ పరిధి ఎంఎస్ఎన్ కాలనీలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. వైద్య సేవలపై ఆరా తీశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తూ.. గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజల ఇంటి వద్దకే వైద్య సిబ్బందిని పంపించడం గొప్ప విషయమన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఒక వరమన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, వైసిపి యువజన విభాగం నాయకులు జి.ఈశ్వర్ కౌశిక్ , స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బొబ్బిలి : జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని సంఘవీధి అర్బన్ హెల్త్ సెంటర్లో శుక్రవారం జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. మున్సిపల్ చైర్మన్ రాకముందే వైద్య శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయడంతో అధికారులపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చోడిగంజి రమేష్ నాయుడు, డి.సునీత పాల్గొన్నారు.

గైర్హాజరైన అధికారులకు మెమోలు

భోగాపురం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి గైర్హాజరైన మండల స్థాయి అధికారులకు మెమోలు జారీ చేయాలని ఎంపిడిఒ అప్పలనాయుడుకు ఎంపిపి ఉప్పాడ అనూషరెడ్డి ఆదేశించారు. మండలంలోని గుడివాడ పంచాయతీ లో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ఎంపిపితో పాటు ఎమ్మెల్యే హాజరు కానుండడంతో ప్రతి ఒక్క అధికారి తప్పనిసరిగా హాజరు కావాలని సమాచారం ఇచ్చారు. అయితేకొన్ని శాఖల అధికారులు హాజరు కాలేదు. దీంతో వారికి మెమోలు జారీ చేయాలని ఎంపిపి సూచించారు.



విజయనగరంటౌన్.. వైద్య సేవలపై ఆరా తీస్తున్న డిప్యూటీ స్పీకర్

కొత్తవలస : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అందరికీ నాణ్యమైన వైద్యసేవలు లభిస్తాయని ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ అన్నారు. శుక్రవారం గులివిందాడ, గనిశెట్టిపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష శిబిరాలను ఆమె సందర్శించారు. 420 మందికి తనిఖీలు చేసినట్లు వైద్యాధికారి డి.సీతల్ వర్మ, బి.సింహాద్రి నాయుడు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, తహశీల్దార్ శ్రీనివాస్, సర్పంచ్ జామి ఈశ్వరావు, గవర గణబాబు, ఎంపిటిసి గంద్రేడ్డి పావని, కార్యదర్శి, జి.పద్మావతి, మాజీ ఎంపిపి గొరపల్లి శివ, వైసిపి నాయకులు ఒబ్బిన నాయుడు, మేలాస్త్రి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు

వేపాడ : మండలంలో నల్లబెల్లిలో సురక్ష ఆరోగ్య కార్యక్రమంలో ఎంపిపి డి.సత్యవంతుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ సన్యాసినాయుడు, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : కోమటిపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సోదరులు సంబంగి వేణుగోపాల్ నాయుడు సందర్శించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎస్.శాంత కుమారి వైద్యులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల.. వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

నెల్లిమర్ల : కొండగుంపాంలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సందర్శించారు. ప్రజల ఆరోగ్య పరిస్థితులను, వారికి చేస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ల సుధారాణి, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములు నాయుడు, మండల అధ్యక్షులు చనుమల్లు వెంకట రమణ, వైస్ ఎంపిపిలు సారికి వైకుంఠం నాయుడు, పతివాడ సత్యంనారాయణ, టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాస్ రావు, సర్పంచ్ పతి వాడ అప్పన్న, ఎంపిడిఒ గిడుతూరి రామారావు, తహశీల్దార్ డి.ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

వంగర : మండలంలోని శివ్వాంలో సురక్ష ఆరోగ్య కార్యక్రమాన్ని ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ, వైసిపి నాయకులు కరణం సుదర్శన్ రావు సందర్శించారు. కార్యక్రమంలో తహశీల్దార్ డి.ఐజాక్, వైద్యులు ఈశ్వరరావు, సుస్మిత, దయానా, జ్యోతి, సర్పంచ్ బొక్కేల లక్ష్మీనారాయణమ్మ, నాయకులు బొకేల వెంకట అప్పలనాయుడు, ఏనుగుతల వెంకట నాయుడు పాల్గొన్నారు.


శృంగవరపుకోట : మండలంలోని పోతనపల్లి సచివాలయ పరిధిలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సందర్శించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఐసిడిఎస్ పౌష్టికాహార స్టాల్‌ని పరిశీలించారు. కార్యక్రమంలో స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైస్ ఎంపిపిలు పినిశెట్టి వెంకటరమణ, పోతనపల్లి వెంకటరావు, ఎంపిటిసి కూనిరెడ్డి శ్రీదేవి, కృష్ణాపురం సర్పంచ్ యామినీదేవి, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి వాకాడ సతీష్, పెనుగంటి జగదీష్, మోపాడ కోటి, తలారి అనంత్ పాల్గొన్నారు.

పూసపాటిరేగ : ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహించి.. కొన్ని లక్షల మందికి ఉచిత వైద్య సేవలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్నారని ఎంపిపి మహంతి కళ్యాణి అన్నారు. కుమిలి-2 సచివాలయం పరిధిలో ఉప సర్పంచ్ గుజ్జు సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కొప్పెర్ల గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి 400 మందికి వివిధ రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసారు. 25 మందికి కంటి పరీక్షలు చేసి వారికి కళ్లద్దాలు పంపిణీ చేసారు. ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ఉచిత కిట్లను అందజేశారు.



కొత్తవలస.. మందులు అందజేస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

బలవంతపు భూసేకరణ ఆపాలి



తహశీల్దార్‌కు వినతి అందిస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు, రైతులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పోలవరం ఎడమ కాలువ నిర్మాణానికి బలవంతపు భూసేకరణ ఆపాలని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ డిమాండ్ చేశారు. పోలవరం ఎడమ కాలువ భూ బాధిత రైతుల సమస్యలపై తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మద్దిల రమణ మాట్లాడుతూ రైతుల అనుమతి లేకుండా ఏ హక్కుతో జిరాయతీ భూముల్లో అధికారులు అడుగు పెడుతున్నారని తహశీల్దార్ శ్రీనివాసరావును ప్రశ్నించారు. తహశీల్దార్ స్పందిస్తూ ఏరకమైన ఆదేశాలూ రాలేదన్నారు. పోలవరం కాలువకు సంబంధించిన కాంట్రాక్టు వర్కర్స్ వచ్చి సర్వే పాయింట్లు మాకు అర్థం కాలేదని, మండల సర్వేయర్‌ను పంపిస్తే అవి చూపిస్తారని అడిగారని తెలిపారు. ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా రైతుల భూముల్లోకి దౌర్జన్యంగా వస్తే సహించేది లేదని రమణ హెచ్చరించారు. పోలవరం కాలువ పాత డిజైన్ ప్రకారమే పనులు చేపట్టాలన్నారు. సర్వేయర్ వెంకట్రావు రైతులతో అసభ్యకర పదజాలం వాడటంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సర్వేయర్ వ్యవహార శైలి మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వసంత సత్యం, సరిస సూరి అప్పారావు, సిహెచ్ గౌరీశ్వరి, సూర్జం, సిహెచ్ భవాని, అంబటి అప్పారావు, కోటాన సన్యాసమ్మ, చింతాడ బంగారమ్మ, చింతాడ కృష్ణమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో వివిధ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ ఆర్ శ్రీరాములు నాయుడు శుక్రవారం పరిశీలించారు. పారిశుధ్యానికి విఘాతం కలిగించే వారిపై అపరాధ రుసుములు విధించారు. ట్రాఫిక్ కు అంతరాయంగా ఉన్న చిరు వ్యాపారులను క్రమబద్ధీకరించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వాటర్ ట్యాంక్ వద్ద, మయూరి జంక్షన్ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచే బాధ్యత అందరి పైన ఉందన్నారు. విచ్చలవిడిగా పారిశుధ్యానికి ఇబ్బందులు కలిగించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చిరు వ్యాపారులు క్రమ పద్ధతిలో ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ సుధాకర్ రావు, పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.



భారీ వాహనాల రాకపోకలతో దెబ్బతిన్న రోడ్డు

భారీ వాహనాలతో రోడ్లు ధ్వంసం

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని పారాది వంతెన కుంగిపోవడంతో భారీ వాహనాలను దారి మళ్లించడంతో గ్రామీణ ప్రాంత రోడ్లు ధ్వంసమవుతున్నాయి. వంతెన కుంగడంతో భారీ వాహనాలు బాడంగి, తెర్లాం మీదుగా దారి మళ్లించారు. భారీ వాహనాలు వెళ్తున్న రహదారులు దెబ్బతిని రోడ్లపై పెద్దపెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. రోడ్లు పాడైపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

'లెండి' జాబ్‌మేళాలో 93 మంది ఎంపిక

ప్రజాశక్తి-భోగాపురం



జాబ్ మేళాలో ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

భోగాపురంలోని లెండి డిగ్రీ కళాశాలలో ఇటీవల నిర్వహించిన జాబ్‌మేళాలో 93 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ చప్పా కిరణ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను శుక్రవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాకు సుమారు 500 మంది హాజరయ్యారన్నారు. జాబ్‌మేళాలో వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీలతో పాటు ఫార్మా కంపెనీలు కూడా పాల్గొన్నాయని చెప్పారు. ఎంపికైన వారిలో సగం మంది తమ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎంపిక కావడం అనందంగా ఉందన్నారు. కళాశాల సిబ్బంది టి.సుధీర్, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-భోగాపురం



ఆర్‌బికెను ప్రారంభిస్తున్న ఎమ్‌పి బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ

మండలంలోని గుడివాడ పంచాయతీలో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. గుడివాడ గ్రామంలో రూ.1.40 కోట్లతో ఇంటింటి కుళాయిలకు ముందుగా శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.23 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, 40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. వైద్య సేవలు ఏవిధంగా అందుతున్నాయో రోగులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రతిఒక్కరికీ ఎంతో ఉపయోగకరమని అన్నారు. వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ మాట్లాడుతూ మండల అభివృద్ధికి ఎమ్మెల్యే ఎంతో సహకరించారని అన్నారు. అనేక నిధులతో అభివృద్ధి చేసుకున్నామని, అందుకు మళ్లీ ఆయనను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు దాసరి చంద్రశేఖర్, దాసరి లక్ష్మి, తహశీల్దారు బంగార్రాజు, ఎంపిడిఒ అప్పలనాయుడు, మాజీ జెడ్‌పిటిసి ప్రభాకరరెడ్డి, వైస్ ఎంపిపి రావాడబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు భారాలపై నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యుత్తు ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని వామపక్ష నాయకులు పి.శంకరరావు, ఎం.గోపాలం, ఎం.శ్రీనివాస్ చెప్పారు. సిఐటియు కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. స్థానిక బృందావనం ఫంక్షన్ హాల్లో నిర్వహించే రౌండ్ సమావేశానికి కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. విద్యుత్తు భారాలపై వామపక్షాలు చేపట్టే పోరాటంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు.


'నారాయణ'లో దసరా వేడుకలు

విజయనగరంటౌన్ : రింగురోడ్డు వద్దగల నారాయణ పాఠశాలలో శుక్రవారం విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభావతి దేవి, ఆర్ఐ రాజేష్ , ప్రైమరీ కో- ఆర్డినేటర్ దమయంతి పాల్గొన్నారు. విద్యార్థులు మన సంస్కృతీ సాంప్రదాయాలను తెలుసుకొని వాటిని పాటిస్తూ, మంచిగా ఉంటూ విద్యాబుద్ధులు నేర్చుకోవాలని తెలిపారు.

గొర్రిపాటికి ఘన నివాళి

ప్రజాశక్తి - జామి

స్వాతంత్ర సమరయోధులు గొర్రిపాటి బుచ్చి అప్పారావు జయంతి సందర్భంగా జామి బజారు రోడ్డు సమీపంలోని విగ్రహానికి శుక్రవారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడ బాబు, రిటైర్డ్ ఎపిపి జానకి రామయ్య, తదితరులున్నారు. అనంతరం టిడిపి నాయకులు బండారు పెద్దబాబు, వర్రి రమణ, కొత్తలి రాధాకృష్ణ, ప్రముఖ న్యాయవాది బసర్ల రమణారావు నివాళులర్పించారు. ఆలమండలో టిడిపి మండల అధ్యక్షులు లగుడు రవికుమార్ ఆధ్వర్యంలో గొర్రిపాటి జయంతిని నిర్వహించారు. విజినిగిరిలో సర్పంచ్ కిలారి సూర్యారావు ఆధ్వర్యాన నాయకులు యడ్ల గోవింద్, కళ్ళెంపూడి రామునాయుడు అంజలి ఘటించారు. కార్యక్రమాల్లో వైసిపి మండల అధ్యక్షులు గొర్లె రవి కుమార్, ఎంపిపి సబ్బవరపు అరుణ, జెడ్‌పిటిసి జి.సరయు, డిసిసిబి డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ గుడివాడ రాజేశ్వరరావు, బ్యూటిఫికేషన్ డైరెక్టర్ సత్యారావు పాల్గొన్నారు.



గొర్రిపాటి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కడుబండి

గృహ నిర్మాణాలు వేగవంతం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-వేపాడ

అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసి, ఈ నెలాఖరికి పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం హౌసింగ్ డే సందర్భంగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యదర్శులు బాధ్యత తీసుకుని, ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని కోరారు. అనంతరం ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

'అవంతీ'లో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి-గరివిడి

స్థానిక అవంతీ ఇంజినీరింగ్ కాలేజీలో రోబో కపులర్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన రోబో తయారీపై వర్క్ షాప్ శుక్రవారం ముగిసింది. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువ జయప్రసాద్ మాట్లాడుతూ విద్య, వ్యాపార, వైద్య, సైనిక వంటి వివిధ రంగాలలో రోబో ప్రాముఖ్యతను వివరించారు. ఆ రంగాలలో రోబోను ఎలా ఉపయోగించుకోవాలో చెప్పారు. మూడు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్‌పై విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు నిర్వహించి, ప్రశంసా పత్రాలను అందించారు. ఆ కంపెనీ సిఇఒ ఎం.ప్రవీన్ కుమార్ వర్క్‌షాప్‌ను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి.వెంకటరమణ, ఎఒ జి.అనిల్‌కుమార్, విభాగాధిపతి ఎం.ఉమామహేశ్వరరావు, సిఎస్ఎం విభాగాధిపతి జి.ఉమామహేశ్వరరావు, ఇసిఇ విభాగాధిపతి ఎన్.చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

'శ్రీచైతన్య'లో ఆరోగ్యం పట్ల అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శ్రీ చైతన్య విద్యా సంస్థలు ప్రతి నెలా నిర్వహించే 'స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం' లో భాగంగా శుక్రవారం రింగ్‌రోడ్డు పాఠశాలలో బీహెల్దీ.. బీ హ్యాపీ అనే నినాదంతో విద్యార్థులకు ఆహారం-ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్ఆర్ఐ ఆస్పత్రి వైద్యులు ప్రణతి మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చైతన్య పాఠశాలల ప్రాంతీయ పర్యవేక్షకులు వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రతినెలా విద్యార్థులకు అత్యంత ఉపయుక్తమైన కార్యక్రమాలను శ్రీ చైతన్య విద్యాసంస్థ నిర్వహిస్తున్నదని చెప్పారు. ఈ సందర్భంగా కొంతమందికి బిపి, షుగర్ స్థితిగతులను వైద్య బృందం తనిఖీలు చేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫోర్టుసిటీలో స్వచ్ఛభారత్

ఫోర్ట్ సిటీ పాఠశాలలో 'స్వచ్ఛభారత్' కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పాఠశాల చైర్మన్ కెవి రాజు (శివ) మాట్లాడుతూ నదులు, చెరువుల కాలుష్యం వల్ల రోగాలు పెరిగిపోతున్నాయని, దోమలు, క్రిములు పెరిగి ప్రజల ఆరోగ్యాన్ని పాడుచేస్తున్నాయని చెప్పారు. ప్రజలందరూ స్వచ్ఛతను కాపాడితే దేశం ఆరోగ్యవంత మవుతుందని వివరించారు. విద్యార్థులంతా తమ గృహాలను, పాఠశాలలను, పరిసర ప్రాంతా లను శుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ రీయినాఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బి.రాజేరు సర్పంచ్‌కు సతీ వియోగం

ప్రజాశక్తి-బొండపల్లి

మండలంలోని బి.రాజేరు పంచాయతీ సర్పంచ్ ఈదుబిల్లి కృష్ణ భార్య సన్యాసమ్మ అనారోగ్యంతో గురువారం రాత్రి విశాఖలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో మరణించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె భౌతికకాయాన్ని స్వగ్రామమైన బి.రాజేరు తీసుకువచ్చారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, మాజీ మంత్రి పడాల అరుణ, టిడిపి రాష్ట్ర నాయకులు కరణం శివరామకృష్ణ, ఎంపిపి చల్ల చలంనాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు రాపాక సూర్యప్రకాశరావు, బుద్దరాజు నరసింహవర్మ, బండారు బాలాజీ, కొరుపోలు రమేష్ కుమార్, బొద్దల చిన్నం నాయుడు నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ ఈదుబిల్లి కృష్ణకు ధైర్యం చెప్పారు.

సిరిమాను చెట్టుకు పూజలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని జరజాపుపేటలో పైడితల్లమ్మ సిరిమాను చెట్టుకు జనం శుక్రవారం కలశాలతో పూజలు నిర్వహించారు. సిరిమాను చెట్టు వద్ద భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సిరిమాను చెట్టును ఈ నెల 15న విజయనగరం తరలిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నేరాలు ఘోరాలు

పురుగుల మందు తాగి యువకుడు మృతి

ప్రజాశక్తి-రామభద్రపురం

రామభద్రపురంలోని వసంతల వీధికి చెందిన మడక సంతోష్ కుమార్ (30) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. సంతోష్ కుమార్ మద్యానికి బానిసై, పని చేయకుండా ఖాళీగా తిరుగుతుండడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో జీవితంపై విరక్తి కలిగి బుధవారం ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన బాడంగి సిహెచ్‌సికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్య సేవల కోసం కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మరణించాడు. సంతోష్ తండ్రి తిరుపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.